


# ఈ సేవ ఎంతో ఇష్టం

- ఐటీ నిపుణుల ఔదార్యం
- వారాంతాల్లో సర్కారు బడుల్లో విద్యాబోధన

**న్యూస్‌టుడే, బెంగళూరు**

ఏసీ గదుల్లో కూర్చుని తిండీ తిప్పలు మరచి సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములు రూపొందించే ఐటీ నిపుణులకు వారంలో ఐదు రోజులు పని కాగా, రెండు రోజులు.... శని, ఆదివారాలు సెలవులు. ఈ రెండు రోజుల్లో కొందరు సొంతూళ్లకు, మరి కొందరు విహార యాత్రలకు వెళ్తుంటారు. మరికొందరు మాత్రం కొంత సమయాన్ని సంఘసేవకు కేటాయిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి తమకు నచ్చిన, నైపుణ్యమున్న పాఠ్యాంశాల్ని పిల్లలకు బోధిస్తుంటారు.

నగరంలోని ప్రభుత్వ, బుద్ధిమాంద్యుల పాఠశాలల్లో సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఇతర ఉద్యోగులతో రద్దీ పెరిగింది. ఇందిరానగర్‌లోని బుద్ధిమాంద్యుల పాఠశాల స్పాస్టిక్ సొసైటీ ప్రతి శనివారం కనీసం ముప్పై మంది వృత్తి నిపుణులతో కిటకిటలాడుతుంది. ఒక్కో తరగతి గదిలో కనీసం ఇద్దరు ముగ్గురేసి నిపుణులు ఆంగ్లం, గణితం, కంప్యూటరు బోధనలో స్వచ్ఛందంగా నిమగ్నమవుతారు.

వివేక్‌నగర్‌లోని తెలుగు, కన్నడ, తమిళ పాఠశాలలకూ వారాంతాల్లో ముప్పై మంది వరకూ ఐటీ నిపుణులు బోధనకు బారులు తీరుతున్నారు. వీరిలో విప్రో సాఫ్ట్‌వేర్ నిపుణులే 20 మందికి పైగా ఉన్నారు. ఇలా ఆయా ప్రాంతాల్లోని అనుకూలతను బట్టి ప్రభుత్వ పాఠశాలలను, వికలాంగుల పాఠశాలలను ఎంపిక చేసుకొని పిల్లలకు విద్యబుద్ధులు నేర్పుతున్నారు. ఆయా స్కూళ్ల యాజమాన్యాలూ వారికి సహకరిస్తున్నాయి.


పిల్లలకు పాఠాలు చెబుతున్న శ్వేతా

### పునాది.. ప్రాథమిక విద్య

యువత భవితకు ప్రాథమిక విద్యాభ్యాసం పునాది వంటిది. ఈ విలువైన దశను సద్వినియోగం చేసుకొని, బాలల బంగారుబాటకు తనకు తెలిసిన విద్యను బోధించేందుకు వస్తున్నట్లు వరుణ్ అనే సాఫ్ట్‌వేర్ నిపుణుడు 'న్యూస్‌టుడే'తో చెప్పారు. కాలేజీస్థాయి నుంచే సంఘ సేవ ఆవశ్యకత తమ మాస్టార్లు చెప్పిన మంచిమాటను ఆచరిస్తున్నట్లు తెలిపారు. వారంలో ఐదురోజులు విశ్రాంతి లేకుండా పనిచేసి శని, ఆదివారాలు విశ్రాంతి తీసుకోవచ్చు కదా? అనే ప్రశ్నకు బదులిస్తూ, శనివారం సగం రోజు పని చేస్తామన్నారు. అందువల్ల ఇతర పనులకు ఎటువంటి ఆటంకాలూ ఉండవన్నారు.

ఇలా ఎందరో నిపుణులు తమకు తెలిసిన విద్యను బోధిస్తూ పిల్లల భవిష్యత్తుకు పునాది వేస్తున్నారు. అలాంటి వారిలో జి.ఇ ఉద్యోగి పవన్‌కుమార్, మహాలక్ష్మి, దాదా ఇలా రెండు వందలమంది వృత్తి నిపుణులు ఉన్నారు. వీరిబాటలోనే మరికొందరు తమవంతుగా విద్యార్థుల భవితకు బంగారు బాట వేస్తారని ఆశిద్దాం.



### కొనసాగిస్తా

**- శ్వేతా**

హెచ్.సి.ఎల్ కంపెనీలో పనిచేసే శ్వేతా మాట్లాడుతూ ఇప్పుడే కాలేజీ స్థాయి నుంచి బయటకు వచ్చి ఉద్యోగం చేస్తున్నా. ఇప్పటికీ నేను ఒక విద్యార్థిగానే భావిస్తున్నా. ప్రతివారం పిల్లలకు పాఠాలు చెప్పడం చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. ఇకమీదట కూడా సేవపై ఆసక్తి కొనసాగిస్తా.



### కనీసం రెండు తరగతులు

**- కార్తీక్, ఐటీ నిపుణుడు**

వారాంతపు సెలవుల్లో విద్యార్థులతో గడపకుంటే ఏదో వెలితిగా ఉంటుంది. కనీసం రెండు తరగతులైనా తీసుకోందే నాకు మనసొప్పదు. శనివారం రోజు పిల్లలతో గడిపి తన మనస్సును ఉల్లాస పరచుకుంటా.



### సేవ అంటే ఇష్టం

**కృష్ణచైతన్య, ఉద్యోగి**

'ఇప్పుడే కాలేజీ నుంచి బయటి ప్రపంచానికి అడుగుపెట్టాను. చిన్నతనం నుంచి నాకు సేవ అంటే ఎంతో ఇష్టం' అని కృష్ణచైతన్య అనే యువ ఉద్యోగి తెలిపారు.

బెంగళూరు నెల్లూరుపుర తారక రామనగర ప్రైమరీ తెలుగు పాఠశాల. శనివారం నుంచే వారాంతపు సెలవులు కావడంతో.... కార్తీక్ బృందం పిల్లలకు పాఠాలు చెప్పడానికి వెళ్లింది. అప్పటికే ఆ పాఠశాలను ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ దత్తత తీసుకొంది. తాము దత్తత తీసుకొన్న పాఠశాలలో తామే పాఠాలు చెబుతామని, అవసరమైతే మీ సాయం తీసుకుంటామని సదరు సంస్థ ఉద్యోగులు కార్తీక్ బృందానికి తెలిపారు. దీంతో నిరాశకు గురైన కార్తీక్ మిత్రులు మరో పాఠశాలను వెతుక్కుంటూ వెళ్లారు.

ఈ ఒక్క ఉదాహరణ చాలు సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో సేవాభావంపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని కార్తీక్ పేర్కొంటారు. ఇలా వారాంతపు సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలలు, బుద్ధిమాంద్య పాఠశాలల్లో విద్యాబుద్ధులు చెప్పేందుకు నగరంలోని సాఫ్ట్‌వేర్, వృత్తి నిపుణులు, ఇతర ఉన్నత ఉద్యోగులు చురుగ్గా ముందుకొస్తున్నారు.


పాఠాలు బోధిస్తున్న పవన్




పాఠాలు చెప్పేందుకు వచ్చిన వృత్తి నిపుణులు